సాక్షి సంగారెడ్డి

ఆదివారం । 3 । మార్చి । 2024



తెరపైకి మెగా హెచ్‌ఎండీఏ

మెగా హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్ మెంట్ అథారిటీ తెరపైకి రావడం.. ఉమ్మడి మెదక్ జిల్లాకు కలిసి రానుంది.

వివరాలు 8లో ▸



నిర్విరామంగా అభివృద్ధి పనులు

శరవేగంగా అభివృద్ధి చెందుతున్న పటాన్ చెరు డివిజన్ పరిధికి నిధులు కేటాయిస్తూ, అభివృద్ధిని పరుగులు పెట్టిస్తున్నామని ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి అన్నారు.

వివరాలు 9లో ▸

దరఖాస్తుల ఆహ్వానం

సంగారెడ్డి టౌన్: హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ 1వ తరగతి ఇంగ్లిష్ మీడియంలో ప్రవేశాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు గిరిజన అభివృద్ధి శాఖ అధికారి ఫిరంగి శనివారం ప్రకటనలో పేర్కొన్నారు. హైదరాబాద్లోని బేగంపేట, రామంతపూర్ స్కూల్లో మీడియంలో ప్రవేశం కోసం ఈ నెల 11 లోపు దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు.

న్యూస్‌రీల్

ఏడుపాయలకు 167 ప్రత్యేక బస్సులు

సంగారెడ్డి టౌన్: మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని ప్రయాణికుల సౌకర్యార్థం ఏడుపాయలకు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేస్తున్నామని ఆర్టీసీ రీజినల్ మేనేజర్ ప్రభులత శనివారం తెలిపారు. ఈనెల 7 నుంచి 11వ తేదీ వరకు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 167 ప్రత్యేక బస్సులను నడిపిస్తామన్నారు. భక్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

నీటి సమస్య రావొద్దు



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ చంద్రశేఖర్

జిన్నారం(పటాన్‌చెరు): రానున్న ఎండా కాలం దృష్ట్యా జిల్లా వ్యాప్తంగా అన్ని మున్సిపల్ పరిధిలో నీటి సమస్య రాకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ అన్నారు. శనివారం జిన్నారం మండలం బొల్లారం మున్సిపల్ బడ్జెట్‌పై సమావేశం నిర్వహించారు. 2024–25 ఏడాదికి గానూ రూ.33.17 కోట్ల అభివృద్ధి పనులకు కౌన్సిల్ సమావేశం ఆమోదం తెలిపింది. ముఖ్య అతిథిగా ఆయన హాజరయ్యారు. మున్సిపల్ పరిధిలోని సమస్యలపై అధికారులు, కౌన్సిలర్లు చర్చించారు. మార్కెట్ యార్డు నిర్మాణానికి తగిన స్థలాన్ని కేటాయించేలా చర్యలు తీసుకుంటామన్నారు. సమస్యలను పరిష్కరించేలా ప్రజలకు అధికారులు అందుబాటులో ఉండాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ రోజారాణి, కమిషనర్ మంగతాయారు, వైస్ చైర్మన్ అనిల్‌కుమార్‌రెడ్డి, మేనేజర్ నిర్మల, ఆర్‌ఓ శ్రీధర్, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

కేతకీ హుండీ లెక్కింపు

ఝరాసంగం(జహీరాబాద్): దక్షిణ కాశీగా ప్రసిద్ధి చెందిన కేతకీ సంగమేశ్వర ఆలయంలో హుండీ ఆదాయం లెక్కించారు. శనివారం గర్భగుడిలోని పార్వతీ పరమేశ్వరులకు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించి, అధికారులు ఆలయ ప్రాంగణంలో హుండీ లెక్కించారు. 70 రోజులకు గాను రూ. 21,43,707లో ఆదాయం సమకూరినట్లు దేవాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ రంగారావు, ఆలయ ఈఓ శశిధర్ పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆలయ అధికారులు అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

వేతనాలు చెల్లిస్తాం

మున్సిపల్ కార్మికులకు ఆర్డీఓ హామీ



సీఐటీయూ కార్యదర్శి మహిపాల్, యూనియన్ నాయకులతో మాట్లాడుతున్న ఆర్డీఓ రాజు

జహీరాబాద్ టౌన్: మున్సిపల్ కాంట్రాక్టు కార్మికుల పెండింగ్ వేతనాలు చెల్లిస్తామని ఆర్డీఓ రాజు హామీనిచ్చారు. పెండింగ్ వేతనాలను చెల్లించాలని రెండు రోజుల నుంచి విధులను బహిష్కరించి నిరసన తెలుపుతున్నారు. శనివారం కూడా ఆర్డీఓ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి మహిపాల్, యూనియన్ నాయకులతో కలిసి ఆయన, కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి చర్చలు జరిపారు. సమస్యలు, డిమాండ్లను అడిగి తెలుసుకున్నారు. రెండు నెలలకు సంబంధించిన వేతనాలను సోమవారం నుంచి చెల్లిస్తామన్నారు. ఎన్నికల సమయంలో నిర్వహించిన డ్యూటీ డబ్బులు కూడా త్వరలో ఇస్తామని హామీ ఇచ్చారు. ప్రత్యేక అకౌంట్ ఓపెన్ చేసి వేతన డబ్బులు ఖాతాలో ముందుగానే జమ చేస్తామని చెప్పారు. ఆయన హామీతో కార్మికులు నిరసన విరమించారు. కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ (సీఐటీయూ) నాయకులు కామయ్య, యశోదమ్మ సంజీవ్ ధన్రాజ్ పుణ్యమ్మ పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థిగా గాలి అనిల్?

జహీరాబాద్: జహీరాబాద్ బీఆర్‌ఎస్ అభ్యర్థిగా గాలి అనిల్ కుమార్ పేరు ఖరారు చేసినట్లు సమాచారం. ఈ విషయాన్ని పార్టీ వర్గాలు సైతం ధ్రువీకరించాయి. ఈ ప్రాంతంలో పరిచయాలు అధికంగా ఉన్నాయని తెలుస్తోంది. అలాగే ఆర్థిక బలం కూడా ఉండటం ఒక కారణమని సమాచారం. అయితే పార్టీ శ్రేణులు వత్తిడి చేయడం వల్ల అభ్యర్థిత్వాన్ని బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ ఖరారు చేసినట్లు సమాచారం. ఆయన సామాజిక వర్గం అయిన మున్నూరు కాపులు పార్లమెంట్ పరిధిలో అధికంగా ఉన్నందున పేరును ఖరారు చేసినట్లు సమాచారం.

వేద పరిమళం

సండే స్పెషల్

ఆధ్యాత్మిక క్షేత్రంగా భాసిల్లుతున్న బర్దిపూర్ దత్తగిరి మహారాజ్ ఆశ్రమ పాఠశాల వేద విద్యను పునరుద్ధరించే లక్ష్యంతో 17 ఏళ్లుగా ముందుకు సాగుతోంది. సనాతన ధర్మాన్ని కాపాడి వైదిక విద్యను అందిస్తూ అవసరమైన వేద పండితులను తయారు చేస్తోంది. ఉచిత విద్యతో పాటు వసతుల కల్పనకు పెద్దపీట వేస్తోంది. కులాలకు అతీతంగా బోధిస్తూ ఆదర్శంగా నిలుస్తోంది.

ఝరాసంగం(జహీరాబాద్)

- దత్తగిరిలో వైదిక పాఠశాల
- కులాలకు అతీతంగా బోధన
- పలు కోర్సుల్లో ప్రత్యేక శిక్షణ
- ఉచిత విద్యతో పాటు వసతుల కల్పన

దత్తగిరిలో వేద విద్యను నేర్పుతున్న ఆచార్యుడు శివశంకర్ స్వామి



దత్తగిరి మహారాజ్ వైదిక పాఠశాల విద్యార్థులకు కులాలకు అతీతంగా వేద విద్యను బోధిస్తున్నారు. ప్రస్తుతం పాఠశాలలో జంగములతో పాటు కమ్మరి, వడ్రంగి, వాల్మీకి, గిరిజన, రాజపుత్ర విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. ఆశ్రమ పీఠాధిపతి ప్రధానోపాధ్యాయులు డాక్టర్ సిద్ధేశ్వర స్వామి ఆధ్వర్యంలో వేద పాఠశాల కొనసాగుతోంది. కేవలం కొన్ని వర్ణాలకు మాత్రమే కాకుండా ఇతర వర్ణాలకు చెందిన విద్యార్థులు సైతం వేద విద్యను నేర్చుకుంటున్నారు. అంతేకాకుండా ఇక్కడ విద్య నేర్చుకున్న వారు వివిధ ఆలయాల్లో అర్చకులుగా కొనసాగుతున్నారు.

17 ఏళ్లు.. 1,000 మంది విద్యార్థులు

దత్తగిరి వైదిక పాఠశాలలో విద్యార్థులకు పలు కోర్సుల్లో ప్రత్యేక శిక్షణ అందిస్తున్నారు. ప్రవేశ, వరతో పాటు ప్రవర కోర్సులు (అర్చన, పౌరోహిత్య, షోడాశ సంస్కార విద్య), వేదాంత విజ్ఞాన బోధన, న్యాయ, యోగా దర్శన శాస్త్రాల్లో ప్రత్యేక శిక్షణ అందిస్తున్నారు. తెలంగాణతో పాటు ఏపీ, కర్ణాటక, మహారాష్ట్రకు చెందిన విద్యార్థులు వైదిక విద్యను అభ్యసిస్తున్నారు. ఆరు సంవత్సరాల పాటు ఉచిత వైదిక విద్యతో పాటు భోజనం, వసతి సదుపాయాలు కల్పిస్తున్నారు. ఐదో తరగతి ఉత్తీర్ణులై 14 సంవత్సరాలలోపు ఉన్న విద్యార్థులు వైదిక విద్యను నేర్చుకునేందుకు అవకాశం కల్పిస్తున్నారు. 17 సంవత్సరాల్లో సుమారు 1,000 మంది విద్యార్థులకు వైదిక విద్యను అందించారు.



వేద విద్య పఠిస్తున్న విద్యార్థి

సంప్రదాయాల పరిరక్షణ



మన దేశ సంస్కృతి, సంప్రదాయల పరిరక్షణ కోసమే దాతల సహకారంతో సాందీపని వేద గురుకులం ఏర్పాటు చేశాం. రోజూ విధిగా విద్యార్థులకు సనాతన ధర్మం, వేదాలు తదితర అంశాలపై అవగాహన కల్పిస్తున్నాం. పాఠశాలను ఆనుకొని ఏర్పాటు చేసిన గోశాలను విద్యార్థులే నిర్వహిస్తున్నారు.

– పడకంటి సంగమేశ్వర్, వ్యవస్థాపకుడు, వేద గురుకులం



రామాయంపేట వేద గురుకులంలో విద్యనభ్యసిస్తున్న విద్యార్థులు

నిత్యం యజ్ఞ కార్యక్రమం

రామాయంపేట మున్సిపాలిటీ కేంద్రంలోని జాతీయ రహదారి పక్కన సువిశాల స్థలంలో 2017లో సాందీపని వేద పాఠశాల నిర్మించారు. వ్యవస్థాపకులు పడకంటి సంగమేశ్వర్ దాతల సహకారంతో దీనిని ఏర్పాటు చేశారు. ఇక్కడ చదువుతున్న 13 మంది విద్యార్థుల్లో అన్నికులాలకు సంబంధించిన వారు ఉన్నారు. వారికి రోజూ సంస్కృతి, సంప్రదాయాలతో పాటు వేదాలు, ఉపనిషత్తులు, వ్యాకరణం, భారతీయ ఇతిహాసం, వైదిక దినచర్య, ప్రాణాయామం, యోగా, కర్రసాము, మల్ల యుద్ధం తదితర అంశాలపై శిక్షణ ఇస్తున్నారు. ఇక్కడ విద్యార్థులే స్వయంగా గోరక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. పాఠశాలను ఆనుకుని గోశాల ఏర్పాటు చేశారు. ఇక్కడ రోజూ ఉదయం యజ్ఞ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా పలు వేద గురుకులాలకు చెందిన ప్రతినిధులు ఈ పాఠశాలను సందర్శించి వెళ్లారు.

– రామాయంపేట (మెదక్)

మా తాత కోరిక మేరకు



మాది యూపీ. హైదరాబాద్ వచ్చి ఇక్కడే స్థిరపడ్డాం. హైదరాబాద్‌లోని కూకట్‌పల్లిలో మా తాతలు నిర్మించిన దేవాలయం ఉంది. అక్కడ అర్చకుడిగా సేవలు అందించేందుకు మా తాత కోరిక మేరకు రెండేళ్ల క్రితం ఇక్కడికి వచ్చి వైదిక విద్యను నేర్చుకుంటున్నా.

– లోకేశ్వర్ సింగ్, వైదిక పాఠశాల విద్యార్థి, హైదరాబాద్

వసతులు బాగున్నాయి



అర్చకుడు కావాలన్నదే నా కోరిక. మా తండాలో ఉన్న దేవాలయంలో అర్చకులు లేకపోవడంతో వేద విద్యను నేర్చుకుంటున్నా. ఇక్కడి వేద విద్యతో పాటు వసతులు బాగున్నాయి. త్వరలో మా గ్రామంలోని దేవాలయంలో అర్చకుడిగా సేవలు అందిస్తా.

– మహేష్ రాథోడ్, ముంగితండా, న్యాల్‌కల్

ఇష్టంతోనే నేర్చుకుంటున్నా



మా ప్రాంతంలో ఎక్కువగా అర్చకులు లేకపోవడంతో ఇష్టంతో వేద విద్యను నేర్చుకుంటున్నా. పాఠశాలలో నేర్చుకొని మా ప్రాంతంలో అర్చకుడిగా పూజా కార్యక్రమాలు నిర్వహిస్తా. ఇక్కడ ఉచిత విద్యతో పాటు సదుపాయాలు కల్పిస్తున్నారు.

– వైష్ణ హిమవంత్, కురుచేడు, ఒంగోలు జిల్లా, ఏపీ

అర్చకుల కొరత తీర్చేందుకే..



అర్చకుల కొరత తీర్చేందుకు వైదిక పాఠశాలను ఏర్పాటు చేసి అన్ని కులాల వారికి వైదిక విద్యా బోధన చేస్తున్నాం. ఇక్కడ విద్యార్థులకు ఉచిత బోధనతో పాటు అన్నిరకాల వసతులు కల్పిస్తున్నాం. ఆసక్తి ఉన్న ప్రతి ఒక్కరూ వైదిక విద్య నేర్చుకొని సనాతన ధర్మాన్ని కాపాడాలి. వైదిక విద్య ప్రతి ఒక్కరూ నేర్చుకోవచ్చు.

– డా. సిద్ధేశ్వరస్వామి మహారాజ్, ఆశ్రమ పీఠాధిపతి, పాఠశాల ప్రధానాచార్యులు

మహమ్మారిని పారదోలుదాం..

- నేటి పల్స్ పోలియోకు సర్వం సిద్ధం
- జిల్లాలో 1,137 కేంద్రాల ఏర్పాటు



సంగారెడ్డి టౌన్: చిన్నారులు అంగవైకల్యం బారిన పడకుండా ఉండేందుకు పోల్స్ పోలియో కార్యక్రమాన్ని ప్రభుత్వం నిర్వహిస్తుంది. చిరునవ్వులు చిందించాల్సిన ముఖాల్లో బాధ రాకుండా తన వంతుగా కృషి చేస్తోంది. ఆదివారం పల్స్ పోలియో కార్యక్రమానికి జిల్లా యంత్రాంగం సిద్ధమైంది. ఈనెల 3(నేటి) నుంచి మూడు రోజుల పాటు జిల్లాలో ఈ కార్యక్రమాన్ని వైద్యశాఖ చేపడుతోంది. పీహెచ్‌సీలతోపాటు పట్టణ ఆరోగ్య కేంద్రాలు, సామాజిక ఆస్పత్రులు, ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్రాలు, ఇంకా కొన్ని ప్రాంతాల్లో ప్రత్యేక శిబిరాలను నిర్వహించనుంది. జిల్లాలో 1,137 కేంద్రాలను ఏర్పాటు చేయగా, 1,86,190 మంది ఐదేళ్ల లోపు చిన్నారులకు చుక్కల మందు వేయాలని అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నారు. జిల్లావ్యాప్తంగా 4,548 మందికి పైగా బూత్ సభ్యులతోపాటు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. వైద్య సిబ్బందితోపాటు అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలను భాగస్వామ్యం చేశారు. వీరంతా నిర్దేశించిన ప్రాంతాలతోపాటు బస్టాండ్లు, ప్రధాన కూడళ్లలో నిర్వహించే కేంద్రాల్లో విధులు నిర్వహిస్తారు. సంచార కుటుంబాల్లోని చిన్నారులకు చుక్కలు వేసేందుకు గాను 38 మొబైల్ టీమ్స్, 38 మంది రూట్ సూపర్‌వైజర్లను నియమించారు.

ప్రత్యేక కేంద్రాలను ఏర్పాటు చేశాం



05 ఏళ్లలోపు పిల్లలకు పోలియో చుక్కలు తప్పనిసరి. వైద్యశాఖ ఆధ్వర్యంలో పల్స్ పోలియో కార్యక్రమ నిర్వహణకు విస్తృత ఏర్పాటు చేస్తున్నాం. తల్లిదండ్రులు ఏ మాత్రం అశ్రద్ధ చూపకూడదు. మొదటిరోజు చుక్కలు వేయించుకోని వారుంటే మరుసటి రోజు ప్రత్యేక డ్రైవ్ ద్వారా ఇంటింటా వెళ్లి సిబ్బంది వేస్తారు. బస్టాండ్లలో, పలుచోట్లలో కేంద్రాలను ఏర్పాటు చేశాం.

జిల్లా వైద్య శాఖ అధికారి గాయత్రీ దేవి

ప్రయాణం ఒక పరీక్ష!

బాచేపల్లి జ్యోతిబాపూలే గురుకులం విద్యార్థుల దుస్థితి ఇదీ..



సరుకులు తరలించే వ్యాన్‌లో పరీక్షా కేంద్రానికి వెళ్తున్న విద్యార్థినులు

నారాయణఖేడ్: పరీక్షా కేంద్రానికి ఎవరైనా సరే బస్సు, బైక్, కారులో వెళ్తారు. కానీ నారాయణ ఖేడ్ మండలంలో భిన్నంగా సరుకు రవాణా వ్యాన్‌లో తరలించిన ఉదంతం చోటుచేసుకుంది. నిజాంపేట మండలం బాచేపల్లి మహాత్మాగాంధీ జ్యోతిబా పూలే బీసీ బాలికల గురుకుల జూనియర్ కళాశాల విద్యార్థినులకు కల్హేర్‌లో పరీక్షా కేంద్రాన్ని కేటాయించారు. బాచేపల్లి నుంచి కల్హేర్ 10 కిలోమీటర్ల దూరంలో ఉంటుంది. వారు పరీక్షలు రాయడానికి సరైన రవాణా సదుపాయాలను ఏర్పాటు చేయలేదు. సరుకులు తరలించే వ్యాన్‌ను ఏర్పాటు చేయగా దాంట్లోనే రాకపోకలు సాగిస్తుండటంతో ఇబ్బందులు తప్పడం లేదు. శుక్రవారం గురుకులాన్ని సందర్శించిన ఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డికి సైతం రాకపోకలకు పడుతున్న ఇబ్బందులను గురించి వివరించారు. సరైన రవాణా సదుపాయాన్ని కల్పించాలని కోరారు. గురుకులం తీరుపై ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు.

బీఎస్‌ఆర్‌లో అంతరం పెరిగిందా?



బీబీ పాటిల్

జహీరాబాద్: బీఆర్‌ఎస్‌కు భవిష్యత్ లేదని భావించి జహీరాబాద్ ఎంపీ బీబీ పాటిల్ బీజేపీలో చేరారని ఆయన సన్నిహితులు పేర్కొంటున్నారు. ఆపార్టీ అధికారాన్ని కోల్పోవడం, పార్టీలో అంతరం ఏర్పడటం, బీజేపీకి ప్రజల్లో ఆదరణ పెరగడంతో చేరినట్లు చెబుతున్నారు. అంతేకాకుండా మహారాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి అశోక్ చవాన్ కూడా చేరడంతో ఆయనకు అత్యంత సన్నిహితుడిగా ఉన్నందున ఈయన ఆహ్వానం మేరకు చేరినట్లు ప్రచారం సాగుతోంది.రెండేళ్ళగా బీజేపీలో చేరుతున్నట్లు ప్రచారం సాగింది. వ్యాపార రంగంలో స్థిరపడిన ఆయన 2014లో బీజేపీ నుంచి రాజకీయాల్లో ప్రవేశించాలని భావించినా కేసీఆర్ ఆహ్వానం మేరకు టీఆర్‌ఎస్‌లో చేరారు. 2014 ఎన్నికల్లో టీఆర్‌ఎస్(బీఆర్‌ఎస్) టికెట్ దక్కించుకుని కాంగ్రెస్‌కు చెందిన సిట్టింగ్ ఎంపీ సురేష్ షెట్కార్ ను 1,44,631 ఓట్లతో ఓడించారు. 2019ల్లోనూ .. కాంగ్రెస్ తరపున పోటీ చేసిన మదన్ మోహన్‌రావుపై 6,229 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు. ప్రస్తుతం పార్టీలో ఇమడలేకే దూరం అయ్యారనే ప్రచారం సాగుతోంది. శుక్రవారం బీజేపీలో చేరిన మరుసటి రోజే అనూహ్యంగా ఎంపీ టికెట్ దక్కించుకున్నారు. మొదటి జాబితాలోనే టికెట్ ఖరారు చేయడం గమనార్హం. ఇది పార్టీ కార్యకర్తలను విస్మయానికి గురి చేసింది. అయితే బీజేపీ శ్రేణులు, డీసీసీబీ మాజీ చైర్మన్ ఎం.జైపాల్ రెడ్డి అనుచరులు హైదరాబాద్ లోని బీజేపీ కార్యాలయం వద్ద టికెట్ ఇవ్వొద్దని నిరసన తెలిపారు. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ని కలిసి వినతి పత్రం సమర్పించారు. ఆయన చేరిక పట్ల అభ్యంతరం వ్యక్తం చేశారు. అయినా నాయకత్వం అభ్యర్థిత్వాన్ని ఖరారు చేసింది.

రేపు జాబ్ మేళా

సంగారెడ్డి టౌన్: ఉపాధి శిక్షణ కార్యాలయంలో జిల్లాలోని నిరుద్యోగులకు ఈనెల 4న జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి అధికారి వందన తెలిపారు. క్వాలిటీ ఇన్‌స్పెక్టర్, సూపర్ వైజర్ల పోస్టులు 40 ఖాళీలున్నాయని పేర్కొన్నారు. టెన్త్, ఇంటర్, డిగ్రీ, బీటెక్, ఉత్తీర్ణులైన వారు అర్హులని తెలిపారు.

పక్షం రోజులు.. నలుగురు తహసీల్దార్లు!

కల్హేర్(నారాయణఖేడ్): ఇటీవల జిల్లాలో పలువురు తహసీల్దార్ల బదిలీలు జరిగాయి. ఉద్యోగ బాధ్యతల నిర్వహణలో ఇది సాధారణమే అని భావించవచ్చు. కానీ కల్హేర్‌లో మాత్రం పక్షం రోజుల్లో నలుగురు మారడం విశేషం. ఇక్కడ తహసీల్దార్‌గా పనిచేసిన బాలశంకర్ గతనెల 17న కోహీర్‌కు బదిలీపై వెళ్లారు. ఈ స్థానంలో ఎవరినీ నియమించ లేదు. నిజాంపేట తహసీల్దార్ రాజ గణేష్‌ను కల్హేర్ తహసీల్దార్‌గా అదనపు బాధ్యతలు అప్పగించారు. గణేష్‌కు పదవీ బాధ్యతల చేపట్టిన మరుసటి రోజే ఆయనను తప్పించారు. తర్వాత కంగ్టీ డీటీ జుబేర్ అహ్మద్ బాధ్యతలు చేపట్టారు. ఇక మేడ్చల్ జిల్లాలో పనిచేసిన జి.వెంకటేశ్వర్లు డిప్యూటీ కలెక్టర్‌గా శిక్షణ పూర్తి చేసి ఉన్నారు. ఆయన్ను కల్హేర్ తహసీల్దార్‌గా నియమిస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. శనివారం బాధ్యతలు స్వీకరించారు.

మిషన్ భగీరథ నీటి వృథా!





అప్పుడే ఎండలు మండుతున్నాయి. ఈ సమయంలో నీటి అవసరం ఎంత ఉందో అందరికీ తెలిసిందే. ఈ పరిస్థితుల్లో వాటర్ నేల పాలు కావడంతో ప్రజలు గగ్గోలు పెడుతున్నారు. నిజాంపేట మండలం బాచేపల్లిలో మిషన్ భగీరథ నీరు వృథాగా పోతోంది. సింగూరు నుంచి కామారెడ్డి జిల్లాకు సరఫరా చేసే పైపులైన్ లీక్ ఏర్పడి నీరు వృథా అవుతుండటాన్ని సాక్షి కెమెరా క్లిక్ మనిపించింది.

కల్హేర్ (నారాయణఖేడ్)

క్లుప్తంగా

పురుగుల మందు తాగి వ్యక్తి మృతి

టేక్మాల్(మెదక్): పురుగుల మందుతాగి వ్యక్తి మృతి చెందిన ఘటన టేక్మాల్ మండలంలో శనివారం చోటు చేసుకుంది. ఏఎస్ఐ తుక్కయ్య తెలిపిన వివరాల ప్రకారం.. ఎల్లుపేట గ్రామానికి చెందిన సంతోష్‌రెడ్డి(33) వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. కొన్నేళ్లుగా మద్యానికి బానిసై నిత్యం కల్లు, మద్యం సేవిస్తున్నాడు. గత నెల 29న పాపన్నపేట మండలం అర్కెల కల్లు దుకాణం వద్ద మద్యం సేవించి పడి ఉండగా కుటుంబీకులు ఇంటికి తీసుకొచ్చారు. మరుసటి రోజు ఉదయం సంతోష్‌రెడ్డి సరిగ్గా మట్లాడకపోవడంతోపాటు పురుగుల మందు తాగిన వాసన రావడంతో మెదక్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం సూరారం మల్లారెడ్డి ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి మృతి చెందినట్లు తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేశారు.

కుంటలో పడి వ్యక్తి..

కౌడిపల్లి(నర్సాపూర్): కుంటలో పడి వ్యక్తి మృతి చెందిన ఘటన కౌడిపల్లి మండలంలో చోటు చేసుకుంది. శనివారం ఎస్ఐ రంజిత్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. శేరితండాకు చెందిన అజ్మీర రమేశ్ మద్యానికి బానిసయ్యాడు. రోజూ మాదిరిగానే గురువారం అతిగా మద్యం తాగి ఇంటికొచ్చాడు. అదే రోజు రాత్రి 10 గంటల సమయంలో కాలకృత్యాలు తీర్చుకునేందుకు వెళ్తున్నానని భార్య రాణితో చెప్పి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. రాణి, వారి బంధువులు ఎంత వెతికినా ఆచూకీ లభించలేదు. తండాలోని రత్నం కుంటలో శనివారం ఉదయం రమేశ్ మృతదేహం నీటిపై తేలింది.

తెరపైకి మెగా హెచ్‌ఎండీఏ



మెగా హెచ్‌ఎండీఏ(హైదరాబాద్ మెట్రో పాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ) తెరపైకి రావడం ఉమ్మడి మెదక్ జిల్లాకు కలిసి రానున్నది. ప్రస్తుతం ఈ అథారిటీ పరిధి హైదరాబాద్ ఓఆర్‌ఆర్(ఔటర్ రింగు రోడ్డు) వెలుపల మాత్రమే విస్తరించి ఉండగా, కొత్త ప్రతిపాదన ద్వారా ట్రిపుల్‌ఆర్(రీజినల్ రింగు రోడ్డు) నిర్మించినున్న ప్రాంతాలతో అనుసంధానం కానుంది. ఈ పరిణామం ప్రత్యేకించి ఉమ్మడి మెదక్ జిల్లాలో వేగంగా పారిశ్రామిక రంగ విస్తరణకు బాటలు వేయనుంది.

– గజ్వేల్

- ఉమ్మడి మెదక్ జిల్లాకు భారీ ప్రయోజనం
- గజ్వేల్, నర్సాపూర్, సంగారెడ్డి నియోజకవర్గాల్లోని పలు మండలాలు విలీనమయ్యే అవకాశం
- హైదరాబాద్ ఓఆర్‌ఆర్‌తో ట్రిపుల్‌ఆర్ అనుసంధానం
- మరింత వేగంగా పారిశ్రామికరంగ విస్తరణకు బాటలు

గ్రేటర్ హైదరాబాద్ నగరానికి ఉమ్మడి మెదక్ జిల్లా (సిద్దిపేట, మెదక్, సంగారెడ్డి) సరిహద్దు ప్రాంతాలు కేవలం 30 నుంచి 40 కిలోమీటర్లలోపు ఉన్నాయి. ఆయా ప్రాంతాల నుంచి ట్రిపుల్‌ఆర్ నిర్మాణం జరుగనుంది. ఇందుకు సంబంధించి క్షేత్రస్థాయి కార్యాచరణ మొదలైన సంగతి తెల్సిందే. రీజినల్ రింగు రోడ్డు ఉత్తర భాగంలో 158 కిలోమీటర్ల నిడివికి గానూ ఉమ్మడి మెదక్ జిల్లాలో 110 కిలో మీటర్లకు పైనే విస్తరించనుండగా.. 14 మండలాల్లో గల 73కి పైగా గ్రామాల్లో భూసేకరణ చేపట్టడానికి చర్యలు మొదలయ్యాయి.

పలు మండలాలు హెచ్‌ఎండీఏలోకి...

ఉమ్మడి జిల్లా పరిధిలోని జగదేవ్‌పూర్–గజ్వేల్–తూప్రాన్–నర్సాపూర్–సంగారెడ్డి మీదుగా కంది వరకు ఈ రోడ్డు విస్తరించనుంది. ప్రస్తుతం హెచ్‌ఎండీఏ పరిధి హైదరాబాద్ ఔటర్ రింగు రోడ్డు వరకే విస్తరించి ఉంది. దీనిని ఓఆర్‌ఆర్ నుంచి ట్రిపుల్‌ఆర్(రీజినల్ రింగు రోడ్డు) లోపలికి విస్తరింపజేయాలనేది ప్రభుత్వ లక్ష్యంగా ఉంది. ఈ మేరకు గత నెల 28న హైదరాబాద్‌లో నిర్వహించిన ఉన్నతస్థాయి సమీక్షలో సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాలిచ్చిన సంగతి తెల్సిందే. ఈ క్రమంలో మెగా హెచ్‌ఎండీఏ ద్వారా ఉమ్మడి మెదక్ జిల్లాకు కలిగే ప్రయోజనంపై ప్రధానంగా చర్చ మొదలైంది. హైదరాబాద్ అవుటర్ రింగు రోడ్డుకు ట్రిపుల్‌ఆర్(రీజినల్ రింగు రోడ్డు)ను రేడియల్ రోడ్లతో అనుసంధానం చేయడం ద్వారా.. ఉమ్మడి మెదక్ జిల్లాలోని గజ్వేల్, నర్సాపూర్, సంగారెడ్డి నియోజకవర్గాల్లోని పలు మండలాలు మెగా హెచ్‌ఎండీఏలో విలీనం కానున్నాయి. దీని ద్వారా పారిశ్రామికరంగ విస్తరణతోపాటు కొత్త ఐటీ కంపెనీల రాకకు అంకురార్పణ జరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఇందుకోసం గజ్వేల్ నియోజకవర్గంలోని ములుగు, మర్కూక్, జగదేవ్‌పూర్, వర్గల్, తూప్రాన్, మనోహరాబాద్‌తోపాటు నర్సాపూర్, సంగారెడ్డి నియోజకవర్గాల్లో పలు మండలాల్లో దీని ప్రభావం అధికంగా కనిపించనుంది.

బడా పారిశ్రామికవేత్తల దృష్టి ..

హైదరాబాద్ నగరంలో ట్రాఫిక్ పెరిగిపోవడం వల్ల కొత్త కంపెనీల విస్తరణకు అవరోధంగా మారుతుంది. ఈ నేపథ్యంలో మెగా హెచ్‌ఎండీఏ పరిధిలోకి వచ్చే మండలాలపై పెట్టుబడిదారులు, బడా పారిశ్రామికవేత్తల దృష్టి పడనుంది. ఇకపోతే ట్రిపుల్ ఆర్‌కు అనుసంధానంగా రింగు రైల్ ప్రతిపాదన కూడా తెరపైకి వచ్చింది. గతంలో ఈ విషయాన్ని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి ప్రత్యేకంగా ప్రస్తావించి కేంద్రం సానుకూలంగా ఉన్నదని ప్రకటించారు. ఇదే కాకుండా హైదరాబాద్ నగరానికి రాజీవ్‌రహదారి నుంచి వెళ్లే మార్గంలో కంటోన్మెంట్ ప్రాంతంలో ఎలివేటెడ్ కారిడార్ల నిర్మాణానికి కూడా ఆమోదం రావడం కలిసొస్తుంది. దీని ద్వారా రాజీవ్‌రహదారి నుంచి తూంకుంట మీదుగా వెళ్లే ప్రయాణంలో ట్రాఫిక్ ఇబ్బందులకు చెక్ పడి.. ప్రయాణ వ్యవధి తగ్గనున్నది. మొత్తానికి మెగా హెచ్‌ఎండీఏ ఏర్పాటు ప్రతిపాదన రాబోవు రోజుల్లో ఉమ్మడి మెదక్ జిల్లాలోని పలు మండలాల్లో భారీ మార్పులకు బాటలు వేయనుందని చెప్పడంలో సందేహం లేదు.

కష్టాలు దాటి.. కొలువులు సాధించి

- ఏక కాలంలో మూడు ప్రభుత్వ ఉద్యోగాలు
- మంబోజిపల్లి గ్రామానికి చెందిన నల్ల రేణుక ప్రతిభ


నియామక పత్రం అందుకుంటున్న రేణుక

హవేళిఘణాపూర్(మెదక్): కష్టాలను అధిగమించి ప్రభుత్వ కొలువులు సాధించడం అంటే మాటలు కాదు.. లక్ష్యానికి అనుగుణంగా శ్రమించి కష్టపడితే సాధించలేనిది ఏదీ లేదనేందుకు నిదర్శనం ఈ మహిళ. మెదక్ జిల్లా మంబోజిపల్లి గ్రామానికి చెందిన నల్ల రేణుక ఏకంగా మూడు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించారు. తల్లిదండ్రులు నల్ల సత్తయ్య, ఆశ దంపతులది వ్యవసాయం కుటుంబం. కూలీ పనులు చేస్తూ ఆర్థికంగా ఇబ్బందులు ఎదురైనా కష్టపడి కూతురిని చదివించారు. పదవ తరగతి వరకు మెదక్‌లోని ప్రభుత్వ బాలికల పాఠశాలలో చదువుకున్న రేణుక, ఇంటర్ ఆదర్శ జూనియర్ కాలేజీలో చదివారు. అనంతరం 2014లో డిగ్రీ హైదరాబాద్‌లోని నిజాం కాలేజీలో పూర్తి చేశారు. కోఠి ఉమెన్స్ కాలేజీలో ఎం.కామ్ పూర్తి చేసిన రేణుక అప్పటి నుంచే ప్రభుత్వ ఉద్యోగం వైపు అడుగులు వేశారు.

భర్త ప్రోత్సాహంతో..

రేణుకకు ఏడేళ్ల క్రితమే జగిత్యాలకు చెందిన జర్నలిస్టు హరీశ్‌తో వివాహమైంది. అయినా కూడా రేణుక తన లక్ష్యాన్ని మరువలేదు. వీరికి ఒక పాప కూడ ఉంది. ఉద్యోగం చేస్తూనే నిత్యసాధన చేశారు. భర్త ప్రోత్సాహంతో బీఈడీ పూర్తి చేసిన రేణుక ప్రభుత్వ ఉద్యోగానికి సన్నద్ధమవుతూ వచ్చారు. ప్రస్తుతం చేగుంట కేజీబీవీలో కాంట్రాక్ట్ లెక్చరర్‌గా ఉద్యోగం చేస్తున్న ఆమె గతేడాది ప్రభుత్వం నిర్వహించిన పలు గురుకుల కొలువుల పరీక్షలు రాశారు. ఇటీవల విడుదలైన ఫలితాల్లో ఏక కాలంలోనే ఆమె కామర్స్‌లో జూనియర్ లెక్చరర్‌గా, పీజీటీ సోషల్ టీచర్‌గా, టీజీటీ సోషల్ టీచర్‌గా ఎంపియ్యారు. ఒకేసారి మూడు నియామకాలు తన ఖాతాలో వేసుకోవడంతో కుటుంబ సభ్యులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

చదువుల తల్లులు

ఒకే ఇంటిలో ముగ్గురు ప్రభుత్వ ఉద్యోగులు


సరళ

కౌడిపల్లి(నర్సాపూర్): మండల కేంద్రమైన కౌడిపల్లికి చెందిన పిస్కె నర్సింలు రెండవ కూతురు సరళకు టీజీటీ గురుకుల ఉద్యోగం వచ్చింది. గురుకుల పరీక్షలో మంచి ప్రతిభ కనబరచడంతో ఉద్యోగం వచ్చిందని, త్వరలో ప్రభుత్వ నియమాక పత్రం ఇవ్వనున్నట్లు తెలిపాడు. నర్సింలు, అనురాధ దంపతులకు ముగ్గురు కూతుళ్లు, కుమారుడు ఉన్నారు. వ్యవసాయ పనులు చేస్తూ పిల్లలను కష్టపడి చదివించారు. కూతుళ్లు సంధ్యారాణి, సరళ, స్వప్నరాణి ముగ్గురికీ ప్రభుత్వ ఉద్యోగాలు రావడంతో తల్లితండ్రులు సంతోషం వ్యక్తం చేశారు.సరళకు టీజీటీ ఉద్యోగం రాగా, చిన్న కూతురు స్వప్నకు ఇటీవల కానిస్టేబుల్ ఉద్యోగం వచ్చింది. పెద్ద కూతురు సంధ్యకు ఆరేళ్ల కిందట గురుకుల పీజీటీలో ఉద్యోగం వచ్చింది.

అయోధ్యకు ప్రత్యేక రైలు

4వ తేదీన రెండో ట్రిప్



నారాయణఖేడ్: జహీరాబాద్ పార్లమెంట్ పరిధిలోని వారికి కామారెడ్డి రైల్వేస్టేషన్ నుంచి అయోధ్యకు ప్రత్యేక రైలు (నంబర్ 07221) సదుపాయం కల్పించింది. ఈ నెల 4న సోమవారం మధ్యాహ్నం 2.30గంటలకు కామారెడ్డి నుంచి రైలు బయలు దేరుతుంది. కామారెడ్డి, నిజామాబాద్, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్ మీదుగా ఉత్తరప్రదేశ్‌లోని సలార్‌పూర్ రైల్వేస్టేషన్‌కు బుధవారం తెల్లవారుజామున 3.15 గంటలకు చేరుతుంది. అక్కడ నుంచి రోడ్డు మార్గం గుండా భక్తులు అయోధ్యకు వెళ్లాల్సి ఉంది. రైల్వేస్టేషన్ నుంచి అయోధ్య ట్రస్టు ద్వారా ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఎలక్ట్రిక్ బస్సుల్లో భక్తులను అయోధ్యకు తీసుకెళ్తారు. దర్శనాన్ని విజయవంతంగా ముగించుకొని ఈనెల 9న తిరిగి కామారెడ్డికి చేరుకుంటుంది.

రూ.1,800 చెల్లిస్తే రిజర్వేషన్

బాలరాముడి దర్శనానికి వెళ్లేవారు రాను పోను చార్జీల కింద రూ.1,800 చెల్లించగా ట్యాగ్‌తో కూడిన ప్రత్యేక టికెట్ జారీ చేస్తారు. ఈ ప్రత్యేక రైలులో 1,470 మంది ప్రయాణించటానికి వెసులుబాటు ఉంటుంది. ఉచితంగా భోజనం అందిస్తారు.

భక్తులకు సదావకాశం..



పవిత్ర అయోధ్య క్షేత్రాన్ని, బాలరాముడిని దర్శించుకొనేందుకు జహీరాబాద్ పార్లమెంట్ పరిధిలోని వారికి ప్రత్యేక రైలు ఏర్పాటు చేశారు. గత నెల 21న మొదటి ట్రిప్ రైలు వెళ్లగా, ఈనెల 4న రెండో ట్రిప్పు రైలు వెళ్తుంది. అసెంబ్లీ నియోజకవర్గానికి 200మంది చొప్పున వెళ్లేందుకు అవకాశం ఉంది.

– కోటలే రజినీకాంత్, బీజేపీ ఖేడ్ అసెంబ్లీ కన్వీనర్

హోటల్, భవనాలు కనిపిస్తలేవని..

- హరితహారం చెట్లు నరికివేత
- వంటిమామిడి- లక్ష్మక్కపల్లి మార్గంలో ఇష్టారాజ్యం
- అధికారుల ఉదాసీనత


రోడ్డు పక్కన వృక్షాల సముదాయం


చెట్లు నరికి వేతతో బోసిపోయిన రోడ్డు

ములుగు(గజ్వేల్): హరితానికి అక్రమార్కుల చీడ పట్టింది. అధికారుల ఉదాసీనతతో నీడనివ్వాల్సిన వృక్షాలు నేలమట్టమవుతున్నాయి. ములుగు మండలం వంటి మామిడి–లక్ష్మక్కపల్లి మార్గంలో రోడ్డు బౌండరీలోనే దర్జాగా చెట్లను నరికివేస్తున్నారు. హోటల్, భవనాలు కనిపిస్తలేవని వంటిమామిడి మార్కెట్ యార్డు సమీపం నుంచి లక్ష్మక్కపల్లి మలుపు ప్రాంతంలో రాజీవ్‌రహదారి పక్కన హోటల్ యాజమాన్యం అనేక చెట్లను నరికి వేయించిందు. హరితహారంలో భాగంగా రాజీవ్ రహదారి పక్కన గతంలో ప్రభుత్వం మొక్కలు నాటించగా అవి ప్రయాణికులకు నీడనిచ్చే స్థాయికి ఎదిగాయి. ఇటీవల ఇక్కడ హోటల్ నిర్మాణం చేపట్టిన నిర్వాహకుడు రోడ్డుపైన ఉన్న చెట్లను ఎలాంటి అనుమతులు లేకుండా నరికి వేయించాడు.

కేసు నమోదు చేశాం

వంటిమామిడి మార్కెట్ యార్డు సమీపంలో ఎలాంటి అనుమతులు లేకుండా రోడ్డు స్థలంలో ఉన్న ఆరు చెట్లు నరికి వేతకు గురైనట్లు గుర్తించాం. సంబంధిత వ్యక్తిపై కేసు నమోదు చేసి, జరిమానా విధించాం. రెండు చెట్లను మొదట కొట్టేయగా వాటికి రూ.14 వేలు జరిమానా విధించాం. ఆ తర్వాత మరో నాలుగు నరికి వేతకు గురైనట్లు గుర్తించి రూ.60 వేలు జరిమానా విధించాం . నరికి వేసిన ప్రతి మొక్కకు బదులు మూడేసి మొక్కలను నాటింపజేస్తాం.

– కిరణ్, గజ్వేల్ అటవీ రేంజ్ అధికారి

నర్సాపూర్ మార్గంలోనూ..

నర్సాపూర్–శ్రీరాంపూర్ గ్రామాల మధ్య రోడ్డు మార్గంలో సైతం రోడ్డు పక్కన అడ్డగోలుగా చెట్లను నరికి వేస్తున్నారు. 20 రోజుల కిందట 19 చెట్లను నరికి వేశారు. నిబంధనలకు విరుద్ధంగా చెట్లు నరికి వేసినట్లు తమ దృష్టికి వచ్చిందని ములుగు తహసీల్దార్ ప్రవీణ్‌రెడ్డి అన్నారు. విచారణ జరిపి నివేదిక అందజేయాలని రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌ను ఆదేశించామన్నారు. నివేదిక ఆధారంగా వాల్టా చట్టం ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు.

ఉద్యోగుల పాత్ర ప్రశంసనీయం

టీఎన్జీవో జిల్లా అధ్యక్షుడు దొంత నరేందర్


నూతన కార్యవర్గ సభ్యులు

మెదక్: మూగజీవాలకు పశుసంవర్ధక శాఖ ఉద్యోగులు చేస్తున్న సేవలు ప్రశంసనీయమని టీఎన్జీవో జిల్లా అధ్యక్షుడు దొంత నరేందర్ కొనియాడారు. శనివారం స్థానిక టీఎన్జీవో భవన్‌లో జిల్లా పశుసంవర్ధక శాఖ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సర్వసభ్య సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. వీఎల్‌వోలకు గెజిటెడ్ హోదా కోసం కేంద్ర సంఘంపై ఒత్తిడి తెస్తామన్నారు. అనంతరం నూతనంగా ఏకగ్రీవ ఎన్నికైన కార్యవర్గాన్ని అభినందించి జిల్లా కార్యదర్శి రాజ్ కుమార్, ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు బింగి సురేశ్, కార్యదర్శి అభిషేక్ లతో కలిసి నియామకపత్రాలు అందజేశారు. అలాగే పశుసంవర్ధక శాఖ సంఘం ఆధ్వర్యంలో రూపొందించిన డైరీని ఆవిష్కరించారు. కార్యక్రమంలో టీఎన్జీవో జిల్లా ఉపాధ్యక్షుడు పజాలుద్దీన్, సంయుక్త కార్యదర్శి శివాజీ, అల్లాదుర్గం యూనిట్ అధ్యక్షుడు ధర్మాచందర్, పశుసంవర్ధక శాఖ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు రతన్, కార్యవర్గ సభ్యులు నరేశ్, భానుచందర్, ఆంజనేయులు, రాజారామ్ తదితర ఉద్యోగులు పాల్గొన్నారు. అధ్యక్షుడిగా బి.గోపాల్, కార్యదర్శిగా లింగమూర్తి, సహాధ్యక్షులు, హరి శంకర్, కోశాధికారిగా రాకేశ్, ఉపాధ్యక్షులుగా సుదర్శన్ పాని, వీరారెడ్డి, రాజ్ కుమార్, మంజుల ఎన్నికయ్యారు.

వసతులు లేక అవస్థలు


మాట్లాడుతున్న నాయకులు

దుబ్బాక: దుబ్బాక పట్టణంలో బీసీ బాలుర వసతి గృహంలో వసతులు సరిగా లేక విద్యార్థులు నానా అవస్థలు పడుతున్నారని ధర్మ స్టూడెంట్ యూనియన్ ఉమ్మడి మెదక్ జిల్లా ఇన్‌చార్జి లింగాల సురేశ్ అన్నారు. శనివారం పట్టణంలో గల బీసీ బాలుర వసతి గృహాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో ధర్మ స్టూడెంట్ యూనియన్ నాయకులు కనకరాజు, రాజశేఖర్, మనీష్, రాజ్ కుమార్, రాజిరెడ్డి ఉన్నారు.

మద్యానికి బానిసై వ్యక్తి ఆత్మహత్య

చేగుంట(తూప్రాన్): మద్యానికి బానిసైన వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన చేగుంలో చోటు చేసుకుంది. ఎస్ఐ బాలరాజు తెలిపిన వివరాల ప్రకారం.. ఉత్తర్‌ప్రదేశ్‌కు చెందిన కేశ్‌వగౌడ్ (29) ఓ ప్రైవేటు పరిశ్రమలో పని చేస్తూ చేగుంటలో ఉంటున్నాడు. ఇటీవల మద్యానికి బానిసైన కేశవగౌడ్ పనులు చేయకుండా ఇంటి వద్దే ఉంటున్నాడు. ఈక్రమంలో కుటుంబ పోషణ భారమై ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు.

మత్తులో చెరువులో మునిగి..

పటాన్‌చెరు టౌన్: ముత్తంగి చెరువులో వ్యక్తి మృతదేహం లభ్యమైన ఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. పటాన్‌చెరు మండలం ముత్తంగికి చెందిన అబ్దుల్(45) మేస్త్రీ పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. మద్యానికి బానిసైన అబ్దుల్ ఈనెల 1వ తేదీన మద్యం మత్తులో ముత్తంగి గ్రామంలోని చెరువులో దిగగా ఈత రాక మునిగిపోయాడు. స్థానికుల ద్వారా సమాచారం తెలుసుకున్న పోలీసులు, కుటుంబ సభ్యులు చెరువులో గాలింపు చర్యలు చేపట్టగా మృతదేహం లభించలేదు. శనివారం సాయంత్రం మృతదేహం తేలింది. మృతురాలి భార్య బీబీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

భైక్ పొలంలోకి దూసుకెళ్లి..

ప్రమాదవశాత్తు వ్యక్తి మృతి



పొలంలో బైక్ (ఇన్‌సెట్లో) శివకుమార్(ఫైల్)

టేక్మాల్(మెదక్): ప్రమాదవశాత్తు వ్యక్తి మృతి చెందిన ఘటన టేక్మాల్ మండలంలోని ఎక్లాస్‌పూర్ శివారులో చోటు చేసుకుంది. స్థానిక ఏఎస్ఐ తుక్కయ్య తెలిపిన వివరాల ప్రకారం.. టేక్మాల్ గ్రామానికి చెందిన తలారి శివకుమార్ (26)కు భార్య అఖిలతోపాటు ఇద్దరు కుమారులు ఉన్నారు. వ్యవసాయంతో కూలీ పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. భార్యాభర్తల మధ్య తరచూ గొడవలు జరుగుతుండడంతో అఖిల తల్లిగారి ఇంటి వద్దనే ఉంటుంది. శివకుమార్ ఒకటో తేదీన పని నిమిత్తం బయటకు వెళ్లి రాత్రి ఇంటికి రాలేదు. శనివారం ఉదయం టేక్మాల్ నుంచి ఎక్లాస్‌పూర్ వైపు వెళ్తున్న రోడ్డు మలుపులోని పొలంలో బైక్‌పై పడి ఉంది. శివకుమార్ పొలంలో పడి ఉండటాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని విచారణ జరిపారు. మృతుడి భార్య అఖిల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ తుక్కయ్య తెలిపారు.

కాంగ్రెస్‌లోకి భూమ లింగంగౌడ్


కాంగ్రెస్ కండువా కప్పుకుంటున్న భూమలింగంగౌడ్

చేగుంట(తూప్రాన్): మండల కేంద్రమైన చేగుంటకు చెందిన సీనియర్ బీఆర్ఎస్ నాయకుడు తీగల భూమ లింగంగౌడ్ శనివారం గాంధీ భవన్‌లో కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. భూమలింగంగౌడ్ షుగర్ కేన్ ఇండస్ట్రీ డిప్యూటీ కమిషనర్‌గా పనిచేస్తూ ఉద్యమ సమయంలో వాలెంటరీ రిటైర్‌మెంట్ తీసుకున్నారు. అనంతరం బీఆర్ఎస్‌లో ఏళ్ల తరబడి పనిచేసినా తగిన ప్రాధాన్యత లభించకపోవడంతో కాంగ్రెస్‌లో చేరుతున్నట్లు భూమలింగంగౌడ్ పేర్కొన్నారు. శనివారం గాంధీభవన్‌లో తెలంగాణ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ చేతుల మీదుగా పార్టీ కండువా కప్పుకున్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు, ఎమ్మెల్యే మహేశ్ కుమార్, పార్టీ జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులగౌడ్, నియోజకవర్గ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డితో పాటు పలువురు నాయకులు ఉన్నారు.

వరకట్నం వేధింపులు భరించలేక..

ఉరివేసుకొని వివాహిత ఆత్మహత్య


రేఖ (ఫైల్)

దౌల్తాబాద్(దుబ్బాక): వరకట్న వేధింపులు భరించలేక ఓ వివాహిత ఆత్మహత్య చేసుకున్న ఘటన మండల పరిధిలోని ఉప్పరపల్లి గ్రామంలో శనివారం సాయంత్రం చోటు చేసుకుంది. ఎస్ఐ శ్రీరామ్ ప్రేమ్‌దీప్ తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని ముబారస్‌పూర్ గ్రామానికి చెందిన చింత కింది ఎల్లం కూతురు రేఖకి ఉప్పరపల్లి గ్రామానికి చెందిన బాబుతో మూడేళ్ల కిందట వివాహమైంది. అప్పుడే బైక్, బంగారం పెట్టి వివాహం చేయగా, కొద్ది రోజుల తర్వాత మూడు తులాల బంగారం పెడుతానని ఒప్పుకొని ఇవ్వలేకపోయాడు రేఖ తండ్రి ఎల్లం. ఈ విషయంలో భర్త బాబు అత్త, మామ, ఆడపడుచూ రేఖను తరచూ వేధింపులకు గురి చేశారు. ఈ క్రమంలోనే మనస్తాపానికి గురైన రేఖ ఇంట్లో ఫ్యాన్‌కు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకుంది. వరకట్నం వేధింపులు భరించలేక కూతురు ఆత్మహత్య చేసుకుందని మృతురాలి తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

కూతురు పెళ్లి విందుకు వెళ్లొచ్చేసరికి..

ఇంట్లో నగదు, బంగారం చోరీ


చోరీకి గురైన బీరువా

చిన్నశంకరంపేట(మెదక్): ఇంటి తాళం పగులగొట్టి దొంగలు చోరీ చేసిన ఘటన నార్సింగి మండల కేంద్రంలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. నార్సింగి మండల కేంద్రానికి చెందిన మందుగుల అంజయ్య, భారతీ కుమార్తె కావ్యశ్రీ వివాహం గురువారం జరిగింది. శుక్రవారం వరుడి గ్రామమైన కొల్చారంలో వివాహ విందుకు అంజయ్య బంధువులతో కలిసి ఇంటికి తాళం వేసి వెళ్లారు. ఇదే అదునుగా భావించిన దుండగులు ఇంటి తాళం పగుల కొట్టి చోరీకి పాల్పడ్డారు. విందుకు వెళ్లి అర్ధరాత్రి తిరిగి వచ్చేసరికి తాళాలు పగులగొట్టి ఉన్నాయి. లోపలికి వెళ్లి బీరువా తాళం తెరిచి చూడగా నగదు, బంగారం పెట్టిన బ్యాగు కనిపించలేదు. పెళ్లి సమయంలో వచ్చిన బంగారు కానుకలు, కట్నాల డబ్బులు ఒక బ్యాగులో పెట్టి బీరువాలో దాచినట్లు బాధితులు తెలిపారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు నార్సింగి ఎస్ఐ అహ్మద్ మొహినొద్దీన్ తెలిపారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం



కంది(సంగారెడ్డి): గుర్తు తెలియని మృతదేహం లభ్యమైన ఘటన మండల పరిధిలోని బెంగళూరు బైపాస్ రోడ్డు వద్ద చోటు చేసుకుంది. ఇంద్రకరణ్ ఎస్సై విజయ్ కుమార్ కథనం ప్రకారం.. కంది నుంచి బెంగళూరు వెళ్లే బైపాస్ రోడ్డు పక్కన చేర్యాల శివారులో గుర్తు తెలియని మృతదేహం లభ్యమైంది. ఆనవాళ్లనును బట్టి మృతుడి వయస్సు 50 ఏళ్ల నుంచి 55 ఏళ్ల వరకు ఉంటుంది. మృతి చెందిన వ్యక్తి శరీరంపై స్కైబ్లూ కలర్ షర్టు, బ్లూ కలర్ జర్కిన్, ముదురు ఎరుపు రంగుతో పువ్వులు గల లుంగీ ధరించి ఉన్నట్లు ఎస్సై తెలిపారు. మృతుడి ఆనవాళ్లు తెలిసిన వారు 87126 56747, రూరల్ సీఐ 87126 56719 నంబర్లను సంప్రదించాలని పేర్కొన్నారు.